

భద్రతా నియమాలు పాటించాల్సిందే: జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపారులు ఆహార భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాల్సిందేనని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో.. నియమాలు పాటించని వ్యాపారులపై విచారణ నిర్వహించి రూ.1.20లక్షలు జరిమానా విధించారు. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే పదార్థాలను ఆహారం తయారీలో వినియోగించరాదని జేసీ తెలిపారు. ప్రమాణాలు, భద్రతా నియమాలు పాటించని వ్యాపారులపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం-2006లోని నిబంధనల ప్రకారం కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆదిత్యా.. వీరి నిర్లక్ష్యం చూసితివా?



అరసవల్లిలోని ఆదిత్యాలయం

- పరిపాలన శూన్యతతో ఎక్కడి పనులు అక్కడే
- అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం
- పర్యవేక్షణ లోపంతోనే గ్రూపులుగా ఉద్యోగులు
- ఆలయంలో భక్తులకు కానరాని సౌకర్యాలు

అరసవల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి దేవాలయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఆదిత్యాలయంలో గత రెండేళ్లలో నలుగురు ఈవోలు మారారు. దినసరి వేతన సిబ్బంది మూడు గ్రూపులుగా ఏర్పడ్డారు. రెగ్యులర్ సిబ్బందికి కంప్యూటర్ పరిజ్ఞానం లేక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా ఉన్నాయి. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయలోపంతో పరిపాలనా వ్యవస్థ పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులు పట్టించుకునే నాథులు కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దినసరి ఉద్యోగులకు విధుల కేటాయింపుతోపాటు అభివృద్ధి పనుల పర్యవేక్షణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ఆలయానికి దాతలు ఇచ్చే విరాళాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయని పేర్కొంటున్నారు.



అరసవల్లిలో ఫుట్‌బ్రిడ్జి

ఫిట్‌నెస్ ధ్రువపత్రం లేకుండానే ఫుట్‌బ్రిడ్జి



సిమెంట్, క్లాంపులు లేకుండా ఫుట్‌బ్రిడ్జి స్తంభాలు

ఆలయానికి ముందు భక్తుల కోసం కొత్తగా ఫుట్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ఇంజనీరింగ్ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలి. కానీ అదేమీ లేకుండానే దీనిని నిర్మించారు. భూమిలో ఎటువంటి క్లాంప్‌లు బిగించకుండా, సిమెంటింగ్ చేయకుండా స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో భక్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో బ్రిడ్జి పటిష్ఠతకు సంబంధించిన సర్టిఫికెట్ తక్షణమే అందజేయాలని ఈవో ఆదేశించారు. అలాగే సోమవారం విశాఖపట్నంలోని కనకమహాలక్ష్మి ఆలయ ఈఈ సీహెచ్ రమణ, ఏఈ చందన, తదితర దేవదాయశాఖ ఇంజనీరు ఈ బ్రిడ్జి నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

అన్నప్రసాదం గంటసేపు మాత్రమే

భక్తులు స్వామి ఉచిత అన్నప్రసాదాన్ని ఎంతో భక్తితో స్వీకరిస్తుంటారు. గతంలో భక్తులకు మధ్యాహ్నం 2.30 గంటల వరకు అన్నప్రసాదాన్ని అందించేవారు. కానీ కొన్ని రోజులుగా భోజనాలు ప్రారంభమైన గంటలోనే అన్నప్రసాదం పూర్తయిపోయిందని చెబుతున్నారు. దీంతో చాలామంది భక్తులు నిరాశతో వెనుదిరిగిపోతున్నారు. లడ్డూ ప్రసాదం విక్రయాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వైశాఖమాసం ఆదివారం వేళ.. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కాగా ఆ రోజు ఉదయం 10 గంటలకే లడ్డూ ప్రసాదం అయిపోయిందని చెప్పడంతో భక్తులు అసంతృప్తి చెందారు. కౌంటర్లలో టోకెన్లు ఇవ్వకుండానే (మిగతా 6వ పేజీలో..)

పనిచేయని ఆర్వో ప్లాంటు

ఆలయానికి వచ్చే భక్తుల కోసం దాతల సహాయంతో తాగునీరందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు రెండు నెలలుగా పని చేయడం లేదు. దీంతో భక్తులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఆలయ అధికారుల చొరవతో ప్రతీ ఆదివారం మజ్జిగ, మంచినీరు, బిస్కెట్లను భక్తులకు పంపిణీ చేసేవారు. ఇప్పుడు పర్యవేక్షణ లేక తాగునీటికి కూడా గతిలేని దుస్థితి నెలకొందని భక్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రథసప్తమి ఏర్పాట్లలో భాగంగా పలు భవనాలను కూల్చివేయడంతో స్నానాలు గదులు, మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇటీవల తాత్కాలికంగా నిర్మించిన మరుగుదొడ్లు, స్నానాల గదులు సరిగా లేవని పేర్కొంటున్నారు.



ప్రతి ఎకరాకూ సాగునీరు

- ఎత్తిపోతల పథకాల ఆధునికీకరణకు రూ.12కోట్లతో ప్రతిపాదనలు
- మంత్రి అచ్చెన్నాయుడు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, మే 6(ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ రంగం కుదేలైంది. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. ప్రతి ఎకరాకూ సాగునీరు అందజేస్తామ'ని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో రాష్ట్ర నీటిపారుదలశాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకానికి ప్రాధాన్యమివ్వాలి. రూ.4.80 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టాలి. 14 ఎత్తిపోతల పథకాల పనుల ఆధునికీకరణకు రూ.12కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేయాలి. శ్రీపురం, కురుడు, పొడుగుపాడు, నారాయణవలస, కొత్తపేట, నారాయణపురం, చిన్నసాన, నిమ్మాడ, పోలవరం, సుభద్రాపురం, మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకాలు పరిశీలించి ఏఏ ప్రాంతాలకు సాగునీరు అందించాలో గుర్తించాలి. టెక్కలి మండలం బూరగాం, లింగాలవలస, సంతబొమ్మాళి మండలం గొదలాం గ్రామాలకు చెందిన రైతుల విజ్ఞప్తి మేరకు ఎత్తిపోతల పథకాలు మంజూరుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలు పరిశీలించాలి. ఖరీఫ్ నాటికి ఎత్తిపోతల పథకాలన్నీ వినియోగంలోకి తీసుకురావాలి' అని ఆదేశించారు. సమావేశంలో ఈఈ కేవీ సుబ్రహ్మణ్యం, డీఈఈ కామరాజు, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ శివానీ కళాశాల వద్ద హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న నిర్వాహకులు

ప్రశాంతంగా ఏపీ ఈసెట్

ఎచ్చెర్ల, మే 6(ఆంధ్రజ్యోతి): డిప్లమో ఉత్తీర్ణులై ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశానికిగానూ మంగళవారం నిర్వహించిన ఏపీ ఈసెట్-2025 జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. జేఎన్‌టీయూ (అనంతపురం) పర్యవేక్షణలో.. ఆన్‌లైన్ విధానంలో రెండు షిఫ్ట్‌ల్లో పరీక్షను నిర్వహించారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాలలో తొలిషిఫ్ట్‌లో 250 మంది విద్యార్థులకు 245 మంది, రెండో షిఫ్ట్‌లో 186 మందికి 180 మంది హాజరయ్యారు. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల)లో 160మంది విద్యార్థులకు 157 మంది హాజరై పరీక్ష రాశారు.

మామిడి రైతుకు దిగులు

- పూత దశ నుంచీ కష్టాలే
- ఈదురుగాలులకు నేలరాలుతున్న కాయలు
- ఈ ఏడాదీ తప్పని నష్టాలు



మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురానికి చెందిన రుక్మాంగధరావుకు మూడు ఎకరాల మామిడితోట ఉంది. ఐదేళ్లుగా మామిడి దిగుబడి లేక నష్టపోతున్నానని ఆందోళన చెందుతున్నాడు. ఏటా మూడుసార్లు దుక్కితోపాటు గత్తం, ఎరువులు, పురుగుల మందు పిచికారీకి రూ.30వేల వరకూ ఖర్చువుతోంది. దిగుబడి మాత్రం రూ.10వేలకు మించి రావడం లేదని వాపోతున్నాడు.

మెళియాపుట్టి మండలం కొసమాళకి చెందిన అంకడాల లోకనాథం అనే రైతుకు 8 ఎకరాల మామిడితోట ఉంది. నాలుగేళ్ల నుంచి ఆశించినస్థాయిలో దిగుబడి రావడం లేదు. పెట్టుబడి పెరుగుతున్నా.. దిగుబడి లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా మని లోకనాథం ఆవేదన చెందుతున్నాడు. ఈ ఏడాదీ అకాల వర్షాలు, గాలుల తీవ్రతతో మామిడికాయలు నేలరాలి పాడైపోయాయని దిగులు చెందుతున్నాడు



మెళియాపుట్టి, మే 6(ఆంధ్రజ్యోతి): మామిడి పంట చేతికి అందివచ్చే వేళ.. ఈదురుగాలులు, అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడి పూత దశలో పొగమంచు, దోమపోటు బెడద వెంటాడింది. మందులు పిచికారీ చేయడంతో కొంతమేర పూత, పిందెలు నిలబడ్డాయి. ప్రస్తుతం కాయలు కాయగా.. ఈదురుగాలుల ప్రభావంతో చాలాచోట్ల అవి రాలిపోతున్నాయి. కొన్నిచోట్ల వడగళ్ల వర్షం కూడా పడుతుండంతో మామిడికాయలపై మచ్చ తెగుళ్లు ఏర్పడుతున్నాయి. దీంతో తమకు ఈ ఏడాదీ నష్టాలు తప్పేలా లేవని రైతులు వాపోతున్నారు. జిల్లాలో మెళియాపుట్టి, టెక్కలి, నందిగాం, కొత్తూరు, రణస్థలం, పొందూరు, పోలాకి, జలుమూరు, సారవకోట, జి.సిగడాం, లావేరు మండలాల్లో అధికంగా మామిడితోటలు ఉన్నాయి. ఈ ఏడాది సుమారు 2,024 హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్నట్టు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. రెండేళ్ల కిందట ఎకరాకు సుమారు మూడు టన్నుల వరకు దిగుబడి వచ్చేది. ఇటీవల అకాల వర్షాలకు, ఈదురుగాలుల ఉధృతికి చాలాచోట్ల మామిడికాయలు నేలరాలాయి. వాతావరణం మార్పుల కారణంగా ఈసారి ఎకరాకు టన్ను దిగుబడి అయినా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన (మిగతా 6వ పేజీలో..)

ఈ ఏడాది నుంచే బీమా

ఈ ఏడాది నుంచి జీడి,మామిడి రైతులకు పంటలు బీమాను ప్రభుత్వం వర్తింపజేసింది. జీడి రైతులు ప్రీమియం చెల్లించటానికి ముందుకు వచ్చినా, మామిడి రైతులు మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఈఏడాది ఎంత మేరకు పంట నష్టం జరిగిందో అంచనాలు రూపొందించి.. ప్రీమియం చెల్లించిన వారికి పరిహారం అందజేస్తాం.

- దుక్క శరత్‌రెడ్డి, ఉద్యానవనశాఖ అధికారి, మెళియాపుట్టి



మాకివలసలో సిరిమానోత్సవం..

అంబరాన 'సిరి' సంబరం

- అసిరితల్లికి మొర్రాటల సమర్పణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన మాకివలస

6లో



భగీరథపురం వద్ద వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు

పట్టుకున్నా.. మా పని మాదే

- వంశధార నదిలో ఆగని ఇసుక తవ్వకాలు

హిరమండలం, మే 6(ఆంధ్రజ్యోతి): హిరమండలం పరిధిలోని వంశధార నది నుంచి ఇసుక అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. కొంతమంది నాయకులు ఇసుకాసురుల అవతారమెత్తి.. నిత్యం వందల ట్రాక్టర్లతో వివిధ ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. భగీరథపురం, సుభలయ, అంబావల్లి, పిండ్రువాడ తదితర గ్రామాల సమీపంలోని వంశధార నది గర్భంలో రాత్రీపగలూ ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇటీవల రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్రమ ఇసుక క్వారీలపై దాడులు నిర్వహించి 13 ట్రాక్టర్లను పట్టుకున్నారు. నామమాత్రపు అపరాధ రుసుం విధించి ట్రాక్టర్లను విడిచి పెట్టేశారు. కాగా.. రెండు రోజుల తర్వాత యథావిధిగా ఇసుక అక్రమ రవాణా మొదలు పెట్టేశారు. అధికారులు పట్టుకున్నా.. మా పని మాదే అన్న చందంగా ఇసుకాసురులు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఆలివ్‌రిడ్లే తాబేళ్లు మృత్యువాత

ఎచ్చెర్ల, మే 6(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరంలో ప్రత్యేకంగా కన్పించే ఆలివ్‌రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. ప్రస్తుతం వేట నిషేధం కారణంగా బోట్లు తాకిడి లేకపోయినా.. సంప్రదాయ తెప్పలకు చిక్కి.. సంరక్షణ కరువై తాబేళ్లు చనిపోతున్నాయి. ఎచ్చెర్ల మండలం బడివానిపేట తదితర సముద్ర తీర ప్రాంతాల్లో వాటి కళేబరాలు దర్శనమిస్తున్నాయి. మత్స్య సంపద వృద్ధిలో కీలకపాత్ర పోషించి.. తీరానికి దూరంగా సముద్రపు లోతుల్లో జీవించే ఈ తాబేళ్లు మృత్యువాత పడు తుండడం ఆందోళన కలిగిస్తోందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



బడివానిపేట సముద్ర తీర ప్రాంతంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల కళేబరాలు

ఆహ్లాదం చిరునామా చెబుతారా?

- నగరంలో అధ్వానంగా పార్కులు
- ఆటలకు అనువుగా లేని వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- విరిగిన పరికరాలు, చిల్లులు పడిన జారుడు బల్లలు



మూలనపడిఉన్న రంగుల రాట్నం

గాంధీ పార్కులో శిథిలమైన ఫౌంటెయిన్



ఇది నగరంలోనే అత్యంత పేరున్న పార్కు. నిత్యం వందలాదిగా పెద్దలు... పిల్లలు ఈ పార్కుకు వస్తుంటారు. పార్కులో అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన రాధాకృష్ణుల విగ్రహం, దాని చుట్టూ చక్కని వాటర్ ఫౌంటెయిన్ సందర్శకులను ఆకట్టుకునేవి. కానీ నేడు అది శిథిలమైపోయింది. పార్కులోని ఆట పరికరాలు కూడా ఉపయోగకరంగా లేవు. అవి దెబ్బతినడంతో తరచూ పిల్లలు గాయాలపాలవుతున్నారు.

అరసవల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లోనో... తీరిక వేళల్లోనో...పిల్లలు మారాం చేసినప్పుడో... ఆటవిడుపు కోసమో.. సాయంత్రాల్లో సరదాగా గడపాలనుకుంటేనో ఎవరికైనా ఠక్కున గుర్తొచ్చేవి పార్కులు. ప్రస్తుత వేసవి కాలంలో ఎక్కువ మంది పార్కుల వైపే చూస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకునే సిక్కోలు నగరంలో రూ.లక్షలు వెచ్చించి వివిధ ప్రాంతాల్లో పార్కులు నిర్మించారు. కానీ అక్కడికి వెళితే ఆహ్లాదం సంగతి అటుంచితే... పిల్లలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని తల్లిదండ్రులు దేవుళ్లను ప్రార్థించే పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి ప్రధాన కారణం నిర్వహణా లోపం.



ఎక్కడికక్కడ దెబ్బతిన్న పరికరాలు.

ఇందిరా ప్రియదర్శిని పార్కు అలా..

స్థానిక హౌసింగ్ బోర్డు కోలనీలో గల ఇందిరా ప్రియదర్శిని పార్కు నిర్వహణ లోపంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పార్కు గోడలను పడగొట్టి మరీ రాత్రిళ్ల యువత ఇక్కడ పార్టీల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేస్తున్నారు. పార్కులోని పరికరాలు తుప్పుపట్టి పోతున్నాయి. పిల్లలకు ఆడుకునేందుకు అనువుగా లేవు. సిమెంట్ బెంచీలు శిథిలమై.. కూర్చొనేందుకు కూడా అనువుగా లేవు.

ముందుచూపేదీ..?

వేసవి సెలవుల్లో సాయంత్రాలు బయటకు వస్తే నగరంతో పాటు చుట్టు పక్కల సరైన సందర్శనీయ ప్రాంతాలు లేవు. కేవలం పార్కులు మాత్రమే కనిపిస్తున్నాయి. వేసవి సెలవుల్లో పిల్లలు ఆడుకోవడానికి వీలుగా పార్కులను తీర్చిదిద్దాలనే ఆలోచన అధికారులకు లేకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి..ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు వీలుగా వీటిని రూపొందించాలని కోరుతున్నారు. పార్కుల నిర్వహణ బాధ్యతను స్థానిక కాలనీ కమిటీలకు...లేదా అపార్ట్‌మెంట్ వాసులకు అప్పగించాలని సూచిస్తున్నారు.



వేణుగోపాలరావు పార్కులో పాముల పుట్టలు

నగరంలోని అరసవల్లి రోడ్డులోని కొయ్యాన కన్నయ్య కాలనీలో గల గొనెల వేణుగోపాలరావు పార్కులో ఆట పరికరాలన్నీ పూర్తిగా పాడైపోయాయి. పార్కులో పాముల పుట్టలు పెరిగిపోయి... భయానకంగా తయారైంది. ఈ పార్కువైపు వెళ్లడానికే జనం భయపడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.



పిచ్చిమొక్కలు, శిథిలమైన పలకలతో అస్తవ్యస్తంగా పార్కు



పార్కులో కూర్చొనే బల్ల పరిస్థితి

అధ్వానంగా రివర్ వ్యూ పార్కు

స్థానిక పాతబ్రిడ్జి వద్ద ప్రత్యేకించి పిల్లల కోసం నిర్మించిన నాగావళి చిల్డ్రన్స్ పార్కు ఎంతో ఆకర్షణీయంగా.. ఆహ్లాదకరంగా ఉండేది. ఆదివారాలు, సెలవు రోజుల్లో పిల్లలతో సందడిగా కనిపించేది. పిల్లలకు రకరకాల ఆటలు, క్విజ్, విచిత్ర వేషధారణ తదితర పోటీలు నిర్వహించేవారు. ఈ పార్కు నేడు కళతప్పి... పిల్లలకు ఆడుకునేందుకు అనువుగా లేకుండా పోయింది. ఈ పార్కులో నెలకొల్పిన నెహ్రూ విగ్రహం శిథిలమైపోయింది. కొన్నాళ్లుగా దీనిని పూర్తిగా గాలికి వదిలేశారు. దీంతో ఈ పార్కు దారుణంగా తయారైంది.

సకాలంలో విత్తనాలు అందించాలి

- సాగునీటి సరఫరాలో అంతరాయం ఉండకూడదు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 6(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగునీటి సరఫరా, విత్తనాల పంపిణీ వంటి అంశాలపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండరాదని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ గ్రామ, వార్డు సచివాలయాల పరిశుభ్రత, సచివాలయ ఉద్యోగుల పనితీరు, మత్స్య, పశుసంవర్ధక శాఖల పనితీరు, రహదారుల నిర్మాణం, భూవివాదాల పరిష్కారం, పాఠశాలల్లో మౌలిక వసతులు, ఆసుపత్రులలో ఔషధాల లభ్యత వంటి అంశాలపై చర్చించారు. పారిశుధ్య పనులను ప్రతిరోజు ఉదయం 6 గంటలకు ప్రారంభించాలని సూచించారు. మత్స్యశాఖ చేపల పెంపకంపై, పశుసంవర్ధక శాఖ పశువుల వ్యాక్సినేషన్ కార్డుల పంపిణీపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు. విద్య, వైద్యారోగ్య శాఖల పనితీరుపై కలెక్టర్ ఆరా తీశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, తాగునీరు, టాయిలెట్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ వనరుల వినియోగంలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. పనుల్లో ఆలస్యానికి తావు ఇవ్వొద్దన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతుకు దిగులు!

(ఐదో పేజీ తరువాయి)

చెందుతున్నారు. పూతదశలోనే మామిడి తోటలు కొనుగోలు చేసేందుకు కాకినాడ, బరంపురం, అనకాపల్లి, పలాస, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పోటీ పడేవారు. మూడేళ్ల నుంచి గాలుల కారణంగా మామిడికాయలు రాలిపోయి పంట నష్టపోతున్నారు. దీంతో మామిడితోటల కొనుగోలుకు ఈ ఏడాది వ్యాపారులెవరూ ఆసక్తి చూపలేదు. ఫలితంగా రైతులకు నష్టం తప్పడం లేదు.

బీమా ఉన్నా కట్టలేక..

గతంలో మామిడి పంట నష్టపోయినా వైసీపీ ప్రభుత్వం బీమా ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వం జీడి, మామిడి రైతులకు బీమా సౌకర్యం కల్పించింది.

ఏడాదికి ఎకరాకు రూ.1,600 చెల్లిస్తే.. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే రూ.44వేల వరకూ పరిహారం చెల్లించనున్నట్టు ప్రకటించింది. కాగా ప్రీమియం ఎక్కువ కావడంతో రైతులు ఈ బీమా సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

అసభ్య పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు

- ఎస్పీ మహేశ్వరరెడ్డి



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్నఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల వేదికగా ఇతరులను కించపరిచేలా అసభ్యకరమైన, అనైతిక, అవమానకర రీతిలో పోస్టులు పెడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సోషల్ మీడియా, సైబర్ కేసుల నమోదు, దర్యాప్తు, అరెస్టు, ఆర్థిక సైబర్ నేరాల్లో పోగొట్టుకున్న నగదు తదితర అంశాలపై అదనపు ఎస్పీ కె.వి.రమణతో కలిసి సమీక్షించారు. సైబర్ నేరాల దర్యాప్తులో మెలకువలు, అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై నిఘా, అరెస్టు, తీసుకోవాల్సిన చర్యలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే పద్ధతిపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమా ల్లో వ్యక్తుల పైన, సంస్థలపైన హేయమైన, అసత్య ప్రచారాలు, అవమానకరమైన పదజాలంతో ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేయడం, ట్రోలింగ్, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, కించపరిచే వ్యాఖ్యలు చేసినవారిపై కేసు నమోదు చేయాలన్నారు. సైబర్ కేసులు ఛేదించడంలో ప్రతి అంశాన్నీ కీలకంగా చూడాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో బాధిత వ్యక్తులు పోగొట్టుకున్న నగదును గోల్డెన్ అవర్‌లో ఫ్రీజ్ చేయించి... తిరిగి అప్పగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



వ్యవసాయ సిబ్బంది తయారు చేసిన నవధాన్యాల కిట్లు

నవధాన్యాల విత్తన కిట్ల తయారీ

హిరమండలం, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఎంఎల్‌పురం గ్రామంలో మంగళవారం సిబ్బంది నవధాన్య విత్తన కిట్లను తయారు చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనీ సూర్యనారాయణ మాట్లాడుతూ.. వరి పంటలో నవధాన్యాలతో పాటు పీఎం డీఎస్ 12 రకాలతో 2 కేజీల పరిమాణం కలిగిన 200 కిట్లను తయారు చేశామన్నారు. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సంధ్య, సిబ్బంది లత, శ్రీను, ఢిల్లీ, జోగారావు, దమయంతి పాల్గొన్నారు.

ఆదిత్యా.. వీరి నిర్లక్ష్యం చూసితివా?

(ఐదో పేజీ తరువాయి)

కొంతమంది భక్తులకు ప్రసాదాల విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా అన్నప్రసాదం, లడ్డూలు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. అలాగే ఆలయాని కి పర్వదినాల్లో భక్తులు వేలాదిగా వస్తుంటారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఎవరైనా తప్పిపోయినా, లేదా వారి వస్తువులు పోగొట్టుకున్నా, మరేదైనా అవసరం ఉన్నా మైక్ ద్వారా అనౌన్స్ చేయాలి. గతంలో ఉన్న ఈ సదుపాయం నేడు మాయమైంది. సమాచా ర కేంద్రంలో ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

బిల్లులు రిలీజ్ కావాలంటే కమీషన్ ఇవ్వాలా?

ఆలయానికి సంబంధించి, సరుకులు సరఫరా, సేవలకు సంబంధించిన బిల్లులు రిలీజ్ కావాలంటే కమీషన్ చెల్లించాల్సిందేనని, లేదంటే అవి పెండింగ్‌లో ఉండిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా పెట్టిన బిల్లులు రిలీజ్ చేస్తున్నారు తప్ప.. ఏడాది కిందట బిల్లులను పట్టించుకోవడం లేదనే ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆలయ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. అలాగే గోశాలలో పశువుల దాణాకు సంబంధించి నకిలీ బిల్లులతో రూ.20వేలకు పైగా స్వాహా చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే ఆలయానికి సంబంధించిన చాలా కీలకమైన విషయాల్లో దినసరి వేతనదారులే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీరిపై అధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో మూడు గ్రూపులుగా ఏర్పడి, ఆలయంలో వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఈవో శోభారాణి.. ఆలయంలో పరిస్థితులు చక్కదిద్దేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



సిరిమాను తిలకించేందుకు తరలివచ్చిన వేలాది మంది భక్తులు

అంబరాన సిరి సంబరం

- అసిరితల్లికి ముర్రాటల సమర్పణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిన మాకివలస

నరసన్నపేట, మే 6(ఆంధ్రజ్యోతి): మాకివలస గ్రామదేవత అసిరితల్లి సిరిమానోత్సవాలు అంబరాన్ని తాకాయి. గడచిన నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు మంగళవారం సిరి మాను ఊరేగింపుతో ముగిశాయి. శిమ్మ పాపినాయుడు ఇంటి నుంచి బయలుదేరిన సిరిమాను గ్రామంలోని పలు వీధుల గుండా సాగింది. సిరిమానుపై పురోహితుడు యాళ్ల చిన్నప్పల నాయుడు కూర్చొని భక్తులను ఆశీర్వదించారు. వందలాది మంది మహిళలు కలశాలతో ఊరేగిం పులో పాల్గొని అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మంగళవాయిద్యాలు, బాణసంచా కాలుస్తూ గ్రామస్థులు ఊరేగింపులో పెద్ద ఎత్తున పాల్గొని భక్తిని చాటుకున్నారు. సిరిమాను తిరిగే వీధుల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో గ్రామం కిక్కిరిసిపోయింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ జె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట ఎస్ఐలు దుర్గాప్రసాద్, సందీప్, అశోక్‌బాబు, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. రోప్ పార్టీ సాయంతో సిరిమానోత్సవం చేపట్టారు.

అమ్మవారిని దర్శించుకున్న నేతలు

మాకివలసలో అరిసితల్లి ఉత్సవాల్లో పలు పార్టీల నేతలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీమంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్‌తో పాటు పలువురు నేతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత ధర్మాన తేజ్‌కుమార్, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సిరిమానును దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ముగిసిన శ్రీరామనామ దశకోటి మహాయజ్ఞం

- ఘనంగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

శ్రీకాకుళం కల్చరల్, మే 6(ఆంధ్రజ్యోతి): ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో రెండు రోజులుగా సాగుతున్న శ్రీరామనామ దశకోటి మహాయజ్ఞం, హనుమాన్ చాలీసా కోటి పారాయణ, మహాయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక రామాయణ పారాయణ నిర్వహించారు. వీటితో పాటు శ్రీ గాయత్రి, శ్రీరామ, హనుమాన్ మూలమంత్ర జపం, అగ్ని ప్రతిష్ఠాపన, సామూహిక లలితా పారాయణం నిర్వహించారు. అనంతరం పండితులు అన్నదాన చిదంబర శాస్త్రిని, భాస్కరభట్ల శ్రీరామశర్మను సత్కరించారు. అనంతరం సీతారాముల విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. నృత్య దర్శకురాలు నీరజాసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌తోపాటు ఆధ్యాత్మికవేతలు పీవీ రమణమూర్తి, విశ్వనాథం, కామేశ్వరరావు, కనుగుల సత్యం, బండారు వెంకటలక్ష్మి, నేరెళ్ల విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ నాటికి కాలువలు సిద్ధం కావాలి: ఎమ్మెల్యే



అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ నాటికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సాగునీటి కాలువలను సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశించారు. నగరంలోని ఎస్ఈ కార్యాలయంలో ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెగ్యులర్, ఆర్ఎంసీ, బైరిదేశి గెడ్డ పనులపై ఆరా తీశారు. చెక్ డ్యామ్‌లు, ఇతర పనులు కూడా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టాలని సూచించారు. సాగునీటి సంఘాల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలని, రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అరవల రవీంద్ర, సాగునీటి సంఘాల చైర్మన్లు, ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో మెరుగైన సేవలు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మరిన్ని మెరుగైన సేవలను అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. నగరంలోని ఐసీడీఎస్ కేంద్రంలో మంగళవారం ఆయన అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు ఎన్ని ఉన్నాయి. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గార పరిధిలో 57, శ్రీకాకుళం అర్బన్‌లో 176 భవనాల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలల నిర్మాణానికి చర్యలు

గ్రామీణ ప్రాంతాల్లో గోశాలలు, పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో డ్వామా అధికారులతో ఆయన మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయడం, మట్టిని కాపాడడం, భూగర్భ జలాలను పునరుద్ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాక ర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కంచిలి, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల నేల సారవంతమవడమే కాకుండా ఆరోగ్యవంతమైన పంటలు పండుతాయని మండల వ్యవసాయాధికారి ధనుంజయ, ఎన్‌ఎఫ్‌ఏ శివాజీ అన్నారు. అంపురంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎండీఎస్ వేయడం వల్ల నేలను సారవంతం చేసే సూక్ష్మక్రిములు ఉత్పత్తి అవుతాయని.. దీనివల్ల పంటకు అవసరమయ్యే 59రకాల పోషకాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎన్‌ఎఫ్‌ఏ గోవిందరెడ్డి, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, మండల యాంకర్ శివానందం, రేవతి, మీన, పుష్ప, భవానీ, రోహిణి శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

కుళాయిలకు మోటార్లు బిగిస్తే చర్యలు

ఆమదాలవలస, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంచినీటిని సరఫరా చేస్తున్న కుళాయిలకు మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంలో నీటి ఎద్దడికి గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. వివిధ వార్డుల్లో ఇళ్ల యజమానులు కుళాయిలకు మోటార్లను బిగించి అక్రమంగా నీటిని నిల్వ చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఇకపై ఇలా చేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా సింధుపోలమ్మ సంబరాలు

కంచిలి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్కల గ్రామదేవత సింధుపోలమ్మ అమ్మవారి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవాలయం వద్ద సుప్రభాతసేవ, అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం గజముద్దలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల, బుడ్డేపు కామేష్ రెడ్డి, పైల పురుషోత్తం రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

ఇచ్ఛాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని... అన్ని కార్మిక సంఘాలు హాజరు కావాలని ఇచ్ఛాపురం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ పి.పరీక్షకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్మిక సంఘాలకు అవసరమైన ఉచిత న్యాయ సలహాలతో పాటు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

కళలను ప్రోత్సహించండి



కళాకారులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, మే 6 (ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రోత్సహించి... కళలను ఆదరించాలని తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు అంజన్నప్ప కోరారు. మంగళవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల దరిలోని ఓ ప్రైవేటు గృహంలో కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజన్నప్ప మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో ఉన్న కళాకారులను ప్రపంచానికి పరిచయం చేయాలన్న సదుద్దేశంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు సామవేదం బాలసుబ్రహ్మణ్యం, కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయి, హార్మోనిస్టు బెజ్జివరపు హరిబాబు, అరటిగట్ల హరిబాబు, నటులు టేకి వీరభద్రాచారి, టేకి విశ్వేశ్వరరావు, బి.షన్ముఖరావు, పెద్దింటి మోహన్‌దాస్, డి.భానుమూర్తి, ఉగాది వెంకటరావు, చింతాడ గోవిందమ్మ, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎచ్చెర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేట గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యసిద్ధి మహా గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత శ్రీ విజయవీర అభయాంజనేయ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మంగళవారం నారాయణ సేవ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెక్‌పవర్ రద్దుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం బొంతల కోడూరు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు చెక్ పవర్‌ను అన్యాయంగా ఇటీవల డీపీవో రద్దు చేశారని..తమకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో కలెక్టర్ ప్రత్యేక ఉత్తర్వులతో ఉపాధి హామీ నిధులతో బొంతలకోడూరు సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ భవనాల నిర్మాణం చేపట్టారని తెలిపారు. మండల ఇంజనీరింగ్ అధికారుల ఆమోదంతోనే పంచాయితీ నిధులతో నిర్మాణాలను పూర్తి చేసినట్టు తెలిపారు. ఇందులో ఎక్కడా నిధుల దుర్వినియోగం జరగలేదన్నారు. రాజకీయ కక్షతో సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారని అన్నారు. కలెక్టర్ స్పందిస్తూ దీనిపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, నేతింటి నీలమప్పడు, నక్క కృష్ణమూర్తి, సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సోంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): మందస మండలం మేఘమాల గ్రామానికి చెందిన సవర ఉమాపతిని నాటుసారాతో అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మేఘమాల వద్ద దాడులు నిర్వహిస్తుండగా 240 లీటర్ల నాటుసారాతో పట్టుబడినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సూజాత, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ఆమదాలవలస, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైద్యులు చాపర సుధాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే టీ20 కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. మంగళవారం కళింగపట్నం, వీరఘట్టం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కళింగపట్నం విజయం సాధించింది.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

ఎచ్చెర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో కారు పున్నయ్య అన్నారు. చినకొంగరాం గ్రామంలో స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి మంగళవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ముద్దాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి, 577 మార్కులు సాధించిన నక్క షర్మిల, 566 మార్కులు సాధించిన తుర్ల హారికలతో పాటు మొత్తం 18 మందికి జ్ఞాపికలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దున్న రామ్మోహనరావు, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు వి.తవిటిరాజు, ఎం.జనార్దనరావు, మాజీ ఎంపీటీసీ గుండ రవి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాంబాబు, డోకి కమల, నక్క వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



శ్రీకాకుళం క్రైం:ఆందోళనలో పాల్గొన్న కార్మికులు



ఇచ్ఛాపురం: నిరసన తెలుపుతున్న కార్మికులు

శ్రీకాకుళం క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలని... మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ స్కూల్ స్వీపర్లు, ఆయాలు, వాచ్‌మెన్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మున్సిపల్ కార్మికులు కేవలం రూ.4 వేల వేతనంతో ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు కనీస వేతనం రూ.21 వేలకు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పార్ట్‌టైం ఉద్యోగాలని చెప్పి 12 గంటలు పని చేయించుకోవడం అన్యాయమని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పి.వి.డి. ప్రసాదరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పార్వతి, షేక్‌బాను, ఎం.రమణమ్మ, కుమారి, వరలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో...

ఇచ్ఛాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు రమేష్ పట్నాయక్ డిమాండ్ చేశారు. ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మస్టర్ కార్యాలయం వద్ద కార్మికులంతా నిరసన తెలిపారు. లీడర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాద్ తదితరులు

ఇచ్ఛాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎంపీఎం ఎస్.ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీసుకున్న రుణాలతో వ్యాపారాలు చేయడానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ సమావేశంలో సెర్ప్ అధ్యక్షురాలు ఎల్.సుశీల, కార్యవర్గ సభ్యులు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సోంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవతల సంబరాల నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచించారు. ఉప్పలాం గ్రామంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొర్లాం, పాలవలస, బేసిరామచంద్రాపురం, ఉప్పలాం గ్రామాల్లో గ్రామదేవతల సంబరాలు నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అప్పలస్వామి, ఎంపీడీవో ఈశ్వరమ్మ, సీఐ మంగరాజు, తెలుగుదేశం నాయకులు సూరాడ చంద్రమోహన్, జీకే నాయుడు, మడ్డు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి బాగుపడేదెప్పుడో!



పాలవలస వద్ద రహదారిపై రాళ్లు తేలిన దృశ్యం

సరుబుజ్జిలి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఏబీ రోడ్డు నుంచి రొట్టవలస-పురుషోత్తపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి శిథిలావస్థకు చేరుకుంది. ఎక్కడపడితే అక్కడ రహదారి పూర్తిగా రాళ్లు తేలింది. దీనివల్ల అటువైపు ప్రయాణాలు చేసే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాలవలస, రావివలస, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట తదితర గ్రామాలకు చెందిన ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండుగ



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రణస్థలం, మే 6 (ఆంధ్రజ్యోతి): జేఆర్‌పురం పంచాయతీ పరిధిలో పైడితల్లి అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూజారి యడ్ల సూరి, చిన్న దంపతులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మాజీ సర్పంచ్ దెయ్యం వసంతరావు కుటుంబీకులు అమ్మవారికి ముడుపులు చెల్లించారు. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలను కార్మికులుగా గుర్తించండి



డీఎంహెచ్‌ఓ డా.అనితకు సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, వారికి రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.అనితకు అందించారు. గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు సేవలందిస్తున్న ఆశాలకు సెలవులు, సౌకర్యాలు లేవని, వారిని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా మార్పు చేయాలని కోరారు. ఆమెతో పాటు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అమరావతి పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించండి

రణస్థలం, మే 6 (ఆంధ్రజ్యోతి): కొండములగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లలను చదివించాలని అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. మంగళవారం వివిధ గ్రామాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు ఉన్నాయని వివరించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంబైపీసీ, ఓఏఎస్ గ్రూపులు ఉన్నాయని తెలిపారు. పూర్తి స్థాయిలో అధ్యాపకులు ఉన్నారని వివరించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం ఉందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తమ కళాశాలలో పిల్లలను చేర్పించాలని వారు కోరారు.

శ్రీకూర్మనాథుని దర్శించుకున్న శ్రీరంగం స్వామీజీ



స్వామీజీకి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో నరసింహనాయుడు

గార, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీకూర్మనాథుని మంగళవారం శ్రీరంగానికి చెందిన ఆండవన్ స్వామీజీ తన శిష్యబృందంతో దర్శించుకున్నారు. వారికి దేవాలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి చిత్రపటాన్ని ఈఓ నరసింహనాయుడు, అర్చకులు స్వామీజీకి అందజేశారు.

చిత్రలేఖనం పోటీలు

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మంగళవారం ఉదయం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక లైబ్రేరియన్ ఎన్.రామకృష్ణ, ఎం.జనార్దనరావు, డి.ప్రసాద్, జి.కుమారస్వామి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి

శ్రీకాకుళం రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాల్లో అందించే వైద్యసేవలను అందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కిష్టప్పపేటలో మంగళవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, 40 ఏళ్లు దాటిన వారికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. మొత్తంగా 150 మందికి ఉచిత వైద్యసేవలను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భార్గవ్, డా.చైతన్య, మేనేజర్ మూర్తి, నీలవేణి, పావని, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల నూతన కార్యవర్గం

జలుమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల వీఆర్వోల సంఘ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సొంగలి రామారావు, ఉపాధ్యక్షునిగా గొలివి బాలకృష్ణ, కార్యదర్శిగా పొన్నాడ జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలి

పాతపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలని దళిత సంఘాల జేఏసీ నేతలు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాల యంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మా ట్లాడుతూ.. గురుకులాల్లో పారా మెడికల్ కోర్సులు ప్రవేశ పెట్టాలని, జిల్లాలో బాలురు, బాలికలకు వేర్వేరుగా డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టాలన్నారు.

డీటీపీలో ఉచిత శిక్షణ

టెక్కలి, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్‌హబ్ కేంద్రంలో డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కోర్సుల్లో నాలుగు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులు, ఆపై చదువుకున్న విద్యార్థులు ఈనెల 9వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

క్రీడల్లో ఉచిత శిక్షణ

టెక్కలి, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నామని, క్రీడాకారులు వినియోగించుకోవాలని కోచ్ కె.రఘునాథరావు తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 7.30 వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 7 వరకు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 94924 17570 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

టెక్కలి, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు అన్నారు. ప్రజాచైతన్య కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం మూఢ నమ్మకాలపై చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో పాలవలస ధర్మారావు, తమ్మినేని వైకుంఠరావు, ఆకుల ప్రకాషరావు, డీఏ స్టాలిన్, మూల తాతయ్య, యు.గణపతిరావు, పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా

పలాసరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశుదాణాను రాయితీపై అందిస్తోందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ పి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. పశువుల ఆరోగ్యం, ఉత్పత్తిని కాపాడేందుకు నాణ్యమైన దాణాను సరఫరా చేస్తోందన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులు అర్హులన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

● కుమారుడికి గాయాలు ● జర్జంగి వద్ద ఘటన



సింహాచలం (ఫైల్)

టెక్కలి/జలుమూరు, మే 6(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలం జర్జంగి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జలుమూరు మండలం బసివాడ గ్రామానికి చెందిన బుద్దల సింహాచలం (43), కుమారుడు జగన్మోహన్‌రావు సంతబొమ్మాళి బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఆ సమయంలో నరసన్నపేట నుంచి టెక్కలి వైపు చిప్స్ లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ శ్రీజగన్నాథపురం వెళ్లేందుకు జర్జంగి సమీపంలో ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా యూటర్న్ తీసుకుని ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కోటబొమ్మాళి సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సింహాచలం మృతి చెందాడు. కుమారుడు చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కోటబొమ్మాళి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు, కుమార్తె భవాని ఉన్నారు. కుమారుడు పాలిటెక్నిక్, కుమార్తె 9వ తరగతి చదువుతోంది. సింహాచలం మృతి చెందిన విషయం తెలుసుకుని బసివలసలో విషాదఛాయలు అలముకున్నాయి.

వ్యాన్-బైక్ ఢీ ఒకరు..



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మధుసూదనరావు

జి.సిగడాం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉల్లివలస కూడలి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం పూతికవలస గ్రామానికి చెందిన గురాన అప్పలనాయుడు(37) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రాజాం నుంచి విశాఖపట్నం వెళుతున్న లగేజీ వ్యాన్, చీపురుపల్లి నుంచి పూతికవలసకి వెళుతున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తన స్వగ్రామం పూతికవలస ద్విచక్రవాహనంపై వెళుతున్న అప్పలనాయుడుని వ్యాన్ బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు, మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శవ పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు. వ్యాన్ డ్రైవర్ రాజాం మండలం కొఠారిపురం గ్రామానికి చెందిన గిరిజాల ఈశ్వరరావుగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు, మే 6(ఆంధ్రజ్యోతి): కొత్తూరు బీసీ హాస్టల్‌కు సమీపంలో టేకు చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చెట్టుకు ఉరి వేసుకుని ఉన్న వ్యక్తిని మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన కొందరు స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. హిరమండలం మండలం సుభలయి కాలనీకి చెందిన పిన్నింటి నరేష్ (22) చెడు వ్యసనాలకు బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారని మనస్తాపానికి గురై ఉరి వేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శవ పంచనామా చేసి మృతదేహాన్ని పాతపట్నం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్ఐ యాసిన్ తెలిపారు.

28.50 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

కొత్తూరు, మే 6(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట నుంచి ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న 28.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం వసప గ్రామం వద్ద పట్టుకున్నట్లు సివిల్ సప్లై డీటీ, రెవెన్యూ ఎస్ఐలు సీహెచ్ బీమారావు, బి.రామారావు తెలిపారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు వసప వద్ద కాపు కాసి పట్టుకుని వ్యాన్‌ను సీజ్ చేశామన్నారు. వ్యాన్ డ్రైవర్ సవర రామారావు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటకు చెందిన వారు కాగా బియ్యం వ్యాపారి గండెం రవికుమార్ సరుబుజ్జిలి మండలం కూనజమ్మన్నపేటకి చెందిన వ్యక్తి అని, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీరభద్రాపురంలో నాలుగిళ్లలో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

పలాసరూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): పలాస మండలం వీరభద్రాపురం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున నాలుగు ఇళ్లలో ఇద్దరు దొంగలు చోరీకి పాల్పడ్డారు. నాలుగు తులాల బంగారం, 10 తులాల వెండిని అపహరించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వీరభద్రాపురం గ్రామంలో పైల కేశవరావు, తలగాపు మల్లేసు ఇళ్లలో చోరీకి పాల్పడగా ఆ ఇళ్లలో ఏమీ దొరక్కపోవడంతో కాయల ఢిల్లీశ్వరరావు ఇంటిలో దూరి పది తులాల వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్ చోరీ చేశారు. అనంతరం తలగాపు రామారావు భార్య ఇంటిలో నిద్రిస్తుండగా ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడుతో పాటు బంగారు చెయిన్‌ను దొంగిలించి పరారీ అవుతున్న సమయంలో ఆమెకు మెలకువ వచ్చి కేకలు వేయగా ఆమె కుమారుడు జోగారావు దొంగలను వెంబడించినప్పటికీ వారు పరారయ్యారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం క్లూస్ టీమ్, స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు.

240 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

హరిపురం, మే 6(ఆంధ్రజ్యోతి): మేఘమాల గ్రామంలో నవోదయం 2.0లో భాగంగా ఎక్సైజ్ అధికారులు మంగళవారం సీఐ కె.బేబీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 240 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. సారా తయారీ, విక్రయం నేరమని, ఎవరు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే కారిగాం గ్రామంలో పాత సారా కేసు నిందితుడిని అరెస్ట్ చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

సోంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): బైక్‌లు దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సోంపేట సీఐ బి.మంగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ లవరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురానికి చెందిన అమిత్‌కుమార్ పాత్రోను విచారించారు. సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం ప్రాంతాలకు చెందిన ఏడు ద్విచక్ర వాహనాలను దొంగతనం చేశాడు. సోంపేటలో రెండు హీరోహోండాలు, కంచిలి, ఇచ్ఛాపురంలలో రెండు పల్సర్ బైక్‌లతోపాటు బరంపురంలో రెండు ద్విచక్రవాహనాలను దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

జిల్లాలో వివిధ గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరిసింది. వార్షికోత్సవాలు, అమ్మవారి పండగల నేపథ్యంలో మంగళవారం ఆలయాలు, గ్రామాలు కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, ముర్రాటల సమర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయ వార్షికోత్సవం ప్రారంభం



నందిగాం: పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నందిగాం, మే 6(ఆంధ్రజ్యోతి): పెంటూరులో వేంకటేశ్వరస్వామి ఆలయ 23వ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. ధర్మకర్తలు బొడ్డ జనార్దనరావు, కృష్ణా రావు ఆధ్వర్యంలో శ్రీకూర్మం వేద పండితులు గోపీనంబాళ్ల వెంకటదాస్ కూర్మాచార్యులు, ఆలయ అర్చకులు రాజాగోపాలచార్యులు, ఇతర రుత్వికుల పర్యవేక్షణలో విశేష కార్యక్రమాలు చేశారు. సుప్రభాతసేవ, ఆరాధన, సాయంత్రం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, విశేష హోమాలు చేపట్టారు. బుధవారం గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణ, గరుడసేవ ఊరేగింపు ఉంటాయని ధర్మకర్తలు తెలిపారు. ● దిమ్మిడిజోలలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ధ్యానమందిరం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన సలాన వెంకట్రావు మాస్టారు, వాణిశ్రీ దంపతుల ఆధ్వర్యంలో పురోహితులు మదన్‌మోహన్ మిశ్రా, చంద్ర శేఖర్ శర్మ పర్యవేక్షణలో విశేష కార్యక్రమాలు చేపట్టారు. బాబా చిత్రపటాన్ని ఊరేగించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ముర్రాటలు



ఎల్ఎన్‌పేట: ఘటాలతో ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్థులు

ఎల్.ఎన్.పేట, మే 6(ఆంధ్రజ్యోతి): దబ్బపాడు గ్రామంలోని గ్రామదేవత సుమంతాపురం అమ్మ తల్లికి మంగళవారం మహిళలు పెద్ద ఎత్తున ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లిం చారు. మంగళవాయిద్యాలు, డప్పుల దరువులతో గ్రామస్థులంతా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. పాడి పంటలతో అందరూ సంతోషంగా ఉండాలని అమ్మవారిని కోరు కున్నారు. ప్రతి ఏటా వైశాఖ మాసంలో సుమంతాపురం గ్రామదేవతకు మొక్కులు చెల్లించు కోవడం ఆచారంగా వస్తోందని గ్రామ పెద్దలు జె.మోహనరావు, ఎం.లక్ష్మణరావు, పి.సంజీవు, పి.సీతారాం తదితరులు తెలిపారు.

ముగిసిన గ్రామదేవత పండగలు



తెంబూరులో చింతపోలమ్మ గుడికి వెళుతున్న గ్రామస్థులు

పాతపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): తెంబూరు గ్రామంలో చింతల పోలమ్మ గ్రామదేవత పండగలు మంగళవారంతో ముగిశాయి. తొమ్మిదేళ్లకోసారి జరిగే ఈ పండగల కోసం గ్రామానికి ప్రజలు తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. బంధువులతో ఇళ్లన్నీ కళకళలాడాయి. మధ్యాహ్నం జాలారినాటకం, పగటి వేషధారణ, మేళతాళాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున కలశాలతో ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ● ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం నీలమణిదుర్గ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ వార్షిక యాత్రా మహోత్సవాల్లో భాగంగా శ్రీదేవి ఖడ్గనామాలతో కుంకుమార్చనలు, వాస్తుహోమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీగోదాదేవి కోలాట బృందం కోలాట ప్రదర్శన ఆకట్టు కుంది. వేసవి సెలవులు కావడంతో దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



నీలమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

నీలమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు, మే 6(ఆంధ్రజ్యోతి): దేవునల్తాడ గ్రామంలో జరుగుతున్న శ్రీనీలమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాల్లో ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు. అందరూ ఐక్యంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, అగ్నికుల క్షత్రి కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, గోవిందు పాపారావు, కొల్లి రమేష్, వంక రామారావు ఉన్నారు.

పెద్దదూగాంలో అసిరితల్లికి ప్రత్యేక పూజలు

జలుమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పెద్దదూగాంలో కొలువు తీరిన అసిరితల్లి గ్రామదేవత ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం గ్రామస్థులు ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. ఉత్సవ మూర్తులకు పల్లకిలో వేంచేపు చేసి గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారి సన్నిధికి చేరుకొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ని ఆకట్టుకుంది. ● గొటివాడ గ్రామంలో కొలువుతీరిన వీర వెంకటసత్యనా రాయణ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి విగ్రహాన్ని పల్లకిలో వేంచేపుచేసి తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



పెద్దదూగాంలో మహిళల కోలాట ప్రదర్శన

విధుల్లో అలసత్వం వద్దు: మంత్రి అచ్చెన్న

టెక్కలి, మే 6(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా పనిచేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, పింఛన్లు, ఇళ్ల కాలనీలు మంజూరు చేయాలని పలు గ్రామాల నుంచి ప్రజలు వినతి పత్రాలు అందించారు. వీటిని పరిశీలించిన మంత్రి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేస్తూ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ● పేదలకు వరం సీఎం సహాయనిధి అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో తొమ్మిది మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7.71 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

నరసన్నపేట, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి పది రోజుల పాటు నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆహ్వాన కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం నిమ్మాడలో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు, ధర్మకర్తలు పొట్నూరు చిన్నభద్రస్వామి, రుత్వికులు మావుడూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక అందిస్తున్న నిర్వాహకులు

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం: ఎంజీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

కొత్తూరు, మే 6(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబనే లక్ష్యమని, దీని కోసం ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి పథకాలను అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీ ఆవరణలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు మూడునెలల పాటు కుట్టు శిక్షణ ఇస్తున్నామని, తదుపరి రూ.24 వేల విలువ చేసే కుట్టు మిషన్ అందించ నున్నామన్నారు.

కుట్టు శిక్షణ పొందిన మహి ళలు బృందంగా ఏర్పడి ఉపాధి అవకాశాలు పెంపొందించుకుని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో నీరజ, టీడీపీ నాయకులు అగతముడి అరుణకుమార్, పడాల లక్ష్మణరావు, టొంపల తిరుపతిరావు, ఎ.మాధవ రావు, కుంచాల నూకరాజు, మాతల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభాల నుంచి బయటపడేందుకు పోరాటాలే మార్గం

వజ్రపుకొత్తూరు, మే 6(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షోభాల నుంచి బయటపడాలంటే ఐక్య పోరా టాలే శరణ్యమని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య అన్నారు. మంగళవారం నగరంపల్లిలో రైతు సంఘం నాయకుడు బమ్మిడి శ్రీరాములు వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోతున్నా ప్రభుత్వాలు పట్టిం చుకోక పోవడం దారుణమన్నారు. చైనాలో రైతు ప్రయోజనాల కోసం అక్కడి పాలకులు కృషి చేసి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తుంటే మనదేశంలో ప్రభుత్వాలు కార్పొరేట్ వ్యవసాయం పేరుతో కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు చేకూరుస్తున్నాయన్నారు. అనంతరం బమ్మిడి శ్రీరాములు స్మారక స్థూపాన్ని ఆవిష్కరించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు బమ్మి ఆనందరావు, నెయ్యిల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి వాణి

నరసన్నపేట, మే 6(ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సివిల్ కోర్టు న్యాయాధికారి బి.వాణి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని అలాగే బాలల హక్కులను పరిరక్షించాలన్నారు. బాల్య వివాహాలు చేయరాదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు పుచ్చల కల్పన, న్యాయవాదులు జీవీజీ నాయుడు, శ్రీలక్ష్మి, డి.రాజ్‌కుమార్, నాయుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: ఆర్జేడీ

కొత్తూరు, మే 6(ఆంధ్రజ్యోతి): 'కిశోరి వికాసం' పేరుతో వేసవి సెలవుల్లో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ విశాఖ జోన్-1 రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి అన్నారు. కర్లెమ్మ ఆర్‌ఆర్‌కాలనీ, కొత్తూరు-4 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌమారదశలో ఉన్న కిశోర బాలికలు ప్రణాళికాబద్ధంగా ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్య శిక్షణలను వినియోగించుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కొత్తూరు, సీతంపేట సీడీ పీవోలు యు.విమలకుమారి, రంగలక్ష్మి, సూపర్‌వైజర్లు లింగాల శాంతికుమారి, సుధావాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్ట్

టెక్కలి, మే 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏబీవీపీ నాయకులను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. జీవో నెంబరు 77 రద్దు చేస్తానని యువగళం పాదయాత్రలో ఇచ్చినహామీని అమలు చేయక పోవడంతో మంత్రి నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. దీంతో టెక్కలి ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్‌కుమార్, కొన్ని మురళి, జస్వంత్, భరత్‌లను టెక్కలి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

జనావాసాల మద్యం దుకాణం వద్దు

పాతపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తూ ఆ కాలనీ మహిళలు మంగళవారం ధర్నా చేపట్టారు. గత నెలలోనూ నిరసనలు తెలిపిన సంగతి తెలిసిందే. గతంలో మద్యం దుకాణం తరలించేందుకు గడువు కావాలని నిర్వాహకులు కోరడంతో కొంత సమయం ఇచ్చామని.. అయితే ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మరలా ఉద్యమాన్ని పునః ప్రారంభించామన్నారు.

'ఉపాధి' ఏపీవోపై కలెక్టర్ ఆగ్రహం

సంతబొమ్మాళి, మే 6(ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహించిన మండల ఉపాధి ఏపీవో పంగ నర్సింహమూర్తిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం జిల్లాలో ఫాంపాండ్స్ నిర్మాణాలపై కలెక్టర్ ఉపాధి అధికారులు, సిబ్బందితో గూగుల్‌మీట్ నిర్వహించారు. మండలంలోని పొలాల్లో నీటి నిల్వలు ఉంచేందుకు 420 ఫాంపాండ్స్ నిర్మాణం చేపట్టాలని లక్ష్యం నిర్దేశించగా ఇప్పటి వరకు కేవలం 16 ఫాంపాండ్స్ మాత్రమే నిర్మించారు. అనేక పర్యాయాలు సమీక్ష నిర్వహించినా పురోగతి లేకపోవడంతో ఏపీవో నర్సింహమూర్తిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై డ్వామా పీడీ సుధాకర్‌ను వివరణ కోరగా మండలంలోని ఫాంపాండ్స్ నిర్మాణాల్లో చాలా వెనకబడి ఉన్నారని, పనితీరు మార్చుకోవాలని కలెక్టర్ ఏపీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు.

ఎయిర్‌పోర్టు ఏర్పాటు వద్దు

హరిపురం, మే 6(ఆంధ్రజ్యోతి): మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని ఉద్దానం ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు వద్దంటూ వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కళాజాత నిర్వహించారు. రాంపురం, గంగువాడ గ్రామాల్లో ఈ జాతా సాగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కొర వాసు, సొర్ర రామారావు, రాపాక చిరంజీవి మాట్లాడుతూ.. ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేసి ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టవద్దని, ప్రజామోదం తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చాపర సుందర్‌లాల్, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు తాండ్ర ప్రకాష్, వంకల మాధవరావు, హేమారావు, నల్ల హడ్డీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నరసన్నపేట, మే 6(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గృహ నిర్మాణశాఖ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో బోర్లను బాగు చేసి నీటిని సరఫరా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహనిర్మాణాలను పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

నరసన్నపేట, మే 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జమ్ము పంచాయతీలో ఏర్పాటు చేసిన లే అవుట్‌లలో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతిపత్రం అందించారు. పీఎంఏవైలో గృహ నిర్మాణాలు చేపట్టినా అంతర్గత రోడ్లు, శ్మశాన వాటి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. సమావేశం నిర్వ హించి కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రోడ్లను తవ్వి వదిలేశారు

● మండల సమావేశంలో సభ్యుడి ఆవేదన

మెళియాపుట్టి, మే 6(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా నిధులు వచ్చినా పనులు చేపట్టడం లేదని, రోడ్లు తవ్వి వదిలేశారని బాణాపురం సర్పంచ్ చంద్రరావు ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ రాణ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా చంద్రరావు తదితరులు మాట్లాడుతూ.. రోడ్లను తవ్వి వదిలేయడంతో ప్రజలు రాకపోక లకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశం దృష్టికి తీసుకురాగా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో వల్ల నిలిపివేసినట్లు ఏఈ శ్రీకాంత్ తెలిపారు. సుమారు రూ.25 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. కొండల పైన ఉన్న చందనగిరి, కేరాశింగి, గూడ తదితర గ్రామాలకు 80 శాతం పనులు చేయించామన్నారు. బిల్లులు వచ్చిన వెంటనే మిగిలిన పనులు చేపడతామన్నారు. ఎస్.పాలెం గ్రామానికి నిధులు లేక గ్రామస్థులే చందాలు వేసుకుని పనులు చేశారని పడ్డ సర్పంచ్ రామచంద్ర మజ్జి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్‌పండా, వైస్ ఎంపీపీలు ఆదినాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిరసన

సంతబొమ్మాళి,మే6(ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లపై ఎంఎల్‌హెచ్‌పీలు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బోరుభద్ర పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది మంగళవారం నిరసన చేపట్టారు. విద్యార్హత, పనితీరు, సామర్థ్యం, జీతాలపై ఎంఎల్‌హెచ్‌పీలు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అనంతరం వైద్యాధికారి డా.ఆవనికి వినతిపత్రం అందజేశారు.